క్లుప్తంగా

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు


శివలింగానికి కృష్ణా జలాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: మండల పరిధిలోని సప్తనది సంగమేశ్వరంలో ఎగువ పుష్కర ఘాట్ వద్ద ఉన్న ఉమామహేశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసం ప్రారంభ రోజు మార్గశిర బహుళ భాగ్యమి ఆరుద్ర నక్షత్ర పూజలు చేశారు. లలితా దేవి అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజాలు నిర్వహించారు. అదేవిధంగా శివలింగానికి కుంకుమార్చన, పుష్పార్చన, కృష్ణాజలాలతో అభిషేకం, మంగళహారతి వంటి విశేష పూజాక్రతులు చేశారు.

విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి

నందికొట్కూరు: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని కర్నూలు ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల అధినేత ఎక్కలదేవి చంద్రమౌళి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వడ్డెమాన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులు ఆడుకునేందుకు ఐదు క్యారం బోర్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం దాత ఎక్కలదేవి చంద్రమౌళిని ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ మహమ్మద్ హుసేన్ ఘనంగా సన్మానించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొత్తపల్లి: ప్రజలకు సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఉమా రాణి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యలను తీర్చేందుకు ఎప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో భూ సర్వే కోసం రెండు, పుట్టిన రోజు సర్టిఫికెట్ల కోసం రెండు దరఖాస్తులు వచ్చాయని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.

రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోండి

నందికొట్కూరు: పట్టణ, మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. నందికొట్కూరు మండలం రేషన్ షాపు నంబరు 1308004 బీసీ–బీ మహిళ, 1308009 బీసీ–ఏ మహిళ, కొణిదేల గ్రామంలో ఓసీ, దామగట్లలో ఓసీ, కోనేటమ్మపల్లిలో ఓసీ, నందికొట్కూరులో మూడు షాపులు బీసీ–ఈ, బీసీ–ఏ మహిళ, ఓసీ వర్గాల వారికి కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి, ఆత్మకూరు కార్యాలయంలో అందించాలని కోరారు.

సంప్రదాయ నృత్య ప్రదర్శన


సంప్రదాయ నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై సోమవారం విశాఖపట్నానికి చెందిన దర్పణ నాట్య అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకటుకుంది. గణేశప్రార్థన, శివస్తుతి, లింగాష్టకం, నమశ్శివాయతే, సాంబసదాశివా తదితర గీతాలకు లక్ష్మీ సహస్ర, స్వరూప, సింధు, శృతిసైనిక, శరణ్య తదితరులు నృత్యాలు ప్రదర్శించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన దీక్షిత్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించింది.

విద్యుత్‌ను ఆదా చేయాలి

పాములపాడు: విద్యుత్‌ను ఆదా చేయడం ఎంతో అవసరమని ఏఈ అబ్దుల్‌హబీబ్ సూచించారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఏఎన్నార్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం ఉన్నప్పుడు మాత్రమే లైట్లు, ఫ్యాన్‌లు వినియోగించుకోవాలన్నారు. పగటి పూట వీలైనంత వరకు కిటికీలు తెరచి ఉంచడం వలన లైట్లు, ఫ్యాన్ వాడకం తగ్గించుకోవచ్చునని సూచించారు. ఇంట్లో వాడే పరికరాల వల్ల వచ్చే బిల్లులో 30 నుంచి 40 శాతం ఫ్యాన్లు, 15 శాతం ఫ్రిజ్‌లు 20 శాతం లైట్లు, మిగతావి టీవీ, కంప్యూటర్ లాంటి వినియోగం వలన విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని వివరించారు. విద్యుత్‌ను ఆదా చేసి భావితరాలకు భరోసా ఇవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. లైన్‌మెన్లు నాగిరెడ్డి, అయ్యస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భౌ'బోయ్ గ్రామసింహాలు



- నియోజకవర్గంలో నెలకు 200కు పైగా కుక్కకాటు కేసులు
- ఆస్పత్రి నిధులు 25 శాతం వ్యాక్సిన్‌కే ఖర్చవుతున్నట్లు చెబుతున్న వైద్యులు
- వీధి కుక్కల నియంత్రణపై ఊసెత్తని అధికార యంత్రాంగం


కొత్త ముచ్చుమర్రిలోని ఓ వీధిలో గుంపులుగా ఉన్న వీధికుక్కలు


కుక్క కాటుకు గురైన చిన్నారులను పగిడ్యాల ఆసుపత్రికి తీసుకొచ్చిన తల్లి

పగిడ్యాల: పల్లెల్లో వీధి కుక్కల సంతతి పెరిగిపోతోంది. ఏ గ్రామానికి వెళ్లినా.. ఏ సందులో చూసినా.. గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా కుక్కలు రోడ్లపై వెళ్లే పాదాచారులు, వాహన చోదకులు, చిన్న, పెద్ద తేడా లేకుండా అందరినీ వెంటాడి గాయపరుస్తున్నాయి. నెలలో రెండు వందలకు పైగా కుక్కకాటు కేసులు నమోదవుతుండడంతో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. వీధి కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం ఊసేత్తడం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు సమస్యను ప్రతి మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల దృష్టికి తెచ్చినా చర్యలు మాత్రం శూన్యంగానే ఉన్నాయి. నియోజకవర్గంలోని తూర్పు ప్రాతకోట, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పారుమంచాల, కొత్తపల్లి, పాములపాడు, మిడుతూరు, నందికొట్కూరు కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఒక్క పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నెలకు 100కు పైగా కుక్క కాటు కేసులు నమోదవుతున్నాయని వైద్యాధికారి మోహన్ పేర్కొన్నారు. అలాగే తూర్పు ప్రాతకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు దాదాపు 30 కుక్కకాటు కేసులు నమోదవుతున్నట్లు వైద్యాధికారి కృష్ణమూర్తి వెల్లడించారు. ఈ సంఖ్య కేవలం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే వారిదే, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే బాధితులు కూడా ఉన్నారు. అయితే ఆసుపత్రి అభివృద్ధికి వచ్చే నిధుల్లో 25 శాతం కుక్క కాటు వ్యాక్సిన్‌లకే వినియోగిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీధికుక్కల నియంత్రణకు కుటుంబ ఆపరేషన్ (శస్త్ర చికిత్స) చేయించాలని వైద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే పంచాయతీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో మరి.

మూతపడిన సంతాన నిరోధక శస్త్రచికిత్స కేంద్రం

రాష్ట్రవ్యాప్తంగా వీధి కుక్కల సమస్య ఉంది. వీధికుక్కలు దాడి చేసిన పిల్లలను చంపిన కేసులు పత్రికల్లో, టీవీల్లో చూస్తున్నాం. రాత్రి వేళలో కాలు బయట పెట్టాలంటేనే భయం వేస్తోంది. నంద్యాలలో ఉన్న వీధికుక్కల సంతాన నిరోధక శస్త్రచికిత్స కేంద్రం మూతపడింది. వెటర్నరీ డాక్టర్లతో మాట్లాడతాం. వీధి కుక్కలను పట్టుకొని అప్పగించేందుకు ఒక్కోదానికి రూ. 500లకు పైగానే ఖరీదు ఉంది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నాగేంద్రయ్య, ఈఓఆర్డీ, పగిడ్యాల

జనవరి 4, 5 తేదీల్లో స్వర్ణోత్సవాలు

ఆత్మకూరు: వచ్చే యేడాది జనవరి 4, 5వ తేదీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రఘురామచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ కళాశాల 1974 సంవత్సరంలో స్థాపించినట్లు చెప్పారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి (1985–87 బ్యాచ్)ఏవీ నారాయణరెడ్డి శిథిలావస్థలో ఉన్న గదుల పునర్నిర్మాణానికి రూ.15 లక్షలు విరాళంగా అందజేస్తున్నారన్నారు. స్వర్ణోత్సవాలకు పూర్వ విద్యార్థులు హాజరుకావాలని ఆయన కోరారు.

గణిత అధ్యాపకుడికి అభినందన

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌వీఆర్ శేఖర్‌రెడ్డి 'సమూహపు వలయాల బీజగణిత లక్షణాలు–ఒక గణిత విధానం' అంశంపై పరిశోధన చేశారు. డాక్టర్ పి.ప్రతాప్‌సింగ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం శికోహదాబాద్‌లోని జేఎస్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది గణిత అధ్యాపకుడికి అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

మహానంది: మహానంది సమీపంలోని అయ్యన్ననగర్ గ్రామం వద్ద సోమవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. అతి వేగం ప్రమాదాలకు కారణమవుతుందని, ఆలస్యమైనా కొంత నిదానంగా వెళ్లాలని వాహనదారులకు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు.


మహానందిలో రాత్రి ఆరుబయట చలిలో ఇబ్బందులు పడుతున్న భక్తులు

చ..చ..చలి!

మహానంది: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల వల్ల ఉదయం నుంచి రాత్రి వరకూ చలి చంపేస్తోంది. ఆకాశంలో భానుడు వచ్చినా మంచు దుప్పటి వీడటం లేదు. నల్లమలలోని మహానంది, గాజులపల్లె పరిసరాలతోపాటు సమీప గ్రామాల్లో చలికి ప్రజలు వణికిపోతున్నారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చి అద్దెకు గదులను తీసుకోలేని భక్తులు చలికి వణుకుతూ శివ శివా అంటూ సుపథ మండపాల్లో నిద్రించి ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మార్గశిర మాసం, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని మహానందిలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతుశర్మ, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను అలంకరించి పల్లకీలో కొలువుంచి పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీసేవను నిర్వహించారు.

కల్యాణోత్సవం

స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకుని గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం స్థానిక అలంకార మండపంలో కల్యాణం కమనీయంగా సాగింది. రాత్రి మహానందీశుడి దంపతులకు ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. కాగా ఈశ్వరుడికి ప్రీతికరమైన సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

మరకత లింగేశ్వరుడికి అన్నాభిషేకం

గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో గంగ, గౌరీ సమేత మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో మార్గశిరమాసం, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని అన్నాభిషేకం పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మరకతలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం, విశేష అలంకరణ చేపట్టారు. అన్నప్రసాదాన్ని వేలాది భక్తులకు పంపిణీ చేశారు.

అందుబాటులో ప్రకృతి సేద్యం కూరగాయలు

వెలుగోడు: ప్రకృతి సేద్య పద్ధతి ద్వారా పండించిన కూరగాయలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రదర్శించిన ప్రకృతి సేద్య కూరగాయలను ఏఓతోపాటు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఈఓఆర్డీ మురారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోమ పరిశీలించారు.

మొక్కుబడిగా పీజీఆర్ఎస్


జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు మొక్కుబడిగా హాజరైన అధికారులు

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు మొక్కుబడిగా హాజరవుతుండటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా 'పీజీఆర్ఎస్' కార్యక్రమానికి అన్నిశాఖల మండలస్థాయి అధికారులు హాజరవ్వాలని ఆదేశిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలో 21 శాఖల అధికారులుండగా సోమవారం జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు కేవలం ఆరుశాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీన్ని బట్టిచూస్తే కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికే అధికారులు మొక్కుబడిగా హాజరవుతున్నారంటే విధులపట్ల ఎంత అంకిత భావంతో ఉన్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చునని ప్రజలు చర్చించుకొంటున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై జిల్లా కలెక్టర్ తగిన చర్యలు తీసుకొని ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలతో ఆరోగ్యం పదిలం


బావాపురంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యాధికారి దీపానాగవేణి సూచించారు. సోమవారం మండల పరిధిలోని బావాపురం గ్రామంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల వల్ల గ్రామాల్లోని ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. కాచిన నీటిని తాగాలని, చేతులు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. 104 ద్వారా అందించే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో బీపీ, షుగర్, టీబీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్స పొందాలన్నారు. సూపర్‌వైజర్ దేవకరుణమ్మ, గుర్రప్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్మాణానికి సర్వే


స్థలాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చే భక్తులకు వసతి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామని ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మహానందిలో రూ.10.50 కోట్లతో నిర్మించనున్న 55 వసతి గృహాల నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లను దేవదాయశాఖ డీఈ ఎం.శ్రీనివాసప్రసాద్, ఏఈఓ ఎరమల మధు, ఏఈ శ్రీనివాసులుతో కలిసి సోమవారం పరిశీలించారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

వెలుగోడు: మండలంలో మంగళవారం నుంచి ఏర్పాటు కానున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సోమవారం తెలిపారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు: రెవెన్యూ డివిజన్ పరిధిలోని చౌకదుకాణాల డీలర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ నాగజ్యోతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 13వ, వడ్ల రామాపురం 29వ, బైర్లూటీగూడెం 37వ, కురుకుంద గ్రామంలోని 57వ దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. బండిఆత్మకూరు మండలంలో కాకనూరు, పెద్దదేవలాపురం, చిన్నదేవలాపురం, ఈర్నపాడు, జూపాడుబంగ్లా మండలంలో తరిగోపుల, 80బన్నూరు 10, 11, తర్తూరు 13వ, కొత్తపల్లి మండలంలో బావాపురం, బట్టువారిపల్లి, మిడుతూరు మండలంలోని నాగలూటి, కడుమూరు, చౌట్కూరు, దేవనూరులో రెండు, చింతపల్లిలో రెండు, సుంకేసుల, మిడుతూరు, చెరుకుచెర్లలో రెండు చొప్పున, బైరాపురం, పైపాలెం ఒక్కొక్కటి చొప్పున, పగిడ్యాల మండలంలో బీరవోలు, శ్రీశైలంలో సున్నిపెంటలో రెండు, శ్రీశైలంలో మరో రెండు, సున్నిపెంటలో ఒకటి, వెలుగోడు టౌన్, బోయరేవుల గ్రామాల్లో అదనంగా మరో రెండు కొత్త దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

నందికొట్కూరు: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ పని చేస్తుందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగార్జున స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని ఐసా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులను గాలికి వదిలేసిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఐసా ఉద్యమాలు చేసేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. ఇందుకు విద్యార్థుల తల్లిదండ్రులు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, బీబీ, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు


నిందితుడు జోహరా అరెస్టును చూపుతున్న ఎక్సైజ్ సీఐ రామాంజనేయులునాయక్

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ రామాంజనేయులు నాయక్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని నీలిషికారిపేటలో సారా విక్రయిస్తున్న షికారి జోహరాను అదుపులోకి తీసుకొని 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ సీఐ మాట్లాడుతూ.. జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో నాటుసారా బయటపడిందన్నారు. దాడుల్లో ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జబ్రుల్లా, హెడ్ కానిస్టేబుల్ కుమారి, శంకర్‌నాయక్, పద్మనాభం, పోలీసులు శివన్న, మధు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంతా నా ఇష్టం!



జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జూపాడుబంగ్లా: స్థానిక పీహెచ్‌సీలో ఓ అధికారి ఇష్టానుసారంగా విధులకు హాజరవుతుండటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించటంతో పాటు ప్రజలకు వైద్యసేవలు అందించాల్సి ఉంది. అయితే సదరు అధికారి ఉదయం 11 గంటలకు రావడంతో పాటు మధ్యాహ్నం 2 గంటలకే ఇంటికి ఉడాయిస్తున్నాడు. అంతేగాకుండా గత బుధవారం నుంచి సెలవుపెట్టకుండా విధులకు హాజరుకాలేదు. ఎట్టకేలకు సోమవారం విధులకు హాజరైన సదరు అధికారి సాయంత్రం 4 గంటల వరకు ఉండకుండానే ఉడాయించటం గమనార్హం. సిబ్బంది విధులకు హాజరయ్యే తీరును పరిశీలించి వారికి సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన వైద్యాధికారి పట్టించుకోకపోవటంతో సదరు వైద్యుడు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై జిల్లా వైద్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌ను వివరణ కోరగా.. సదరు అధికారి ఆరోగ్యం బాగోలేదని పేర్కొన్నాడు. సెలవు పెట్టకుండా సక్రమంగా విధులకు హాజరు కావటం లేదన్న ప్రశ్నకు సమాధానంగా సక్రమంగా విధులకు హాజరయ్యేలా కమ్మని మరోమారు హెచ్చరిస్తానని చెప్పారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

జూపాడుబంగ్లా: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట కేజీ రోడ్డుపై వెళ్లే వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనాల డ్రైవర్లతో మాట్లాడుతూ.. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, రోడ్డుపర్మిట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేసి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, రోడ్డు నిబంధనలు పాటించకుండా అధిక వేగంతో వెళ్లడం, డ్రైవర్‌కు ఇరువైపులా ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటివి చేయరాదన్నారు. మైనర్లకు బైక్‌లిచ్చి బయటకు పంపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే నిషేధిత గుట్కాలు, రేషన్ బియ్యం వంటి వాటిని అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. అనంతరం వాహనాలను తనిఖీచేసి లైసెన్స్, అధిక లోడు, అనుమతి పత్రాల్లేని వాహనాల డ్రైవర్లకు జరిమానా విధించినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పురాతన బావిని సందర్శిస్తున్న విద్యార్థులు


బావి గోడపై చెక్కిన శిల్పాలు

చారిత్రక బావి సందర్శన

కొత్తపల్లి: మండలంలోని గువ్వలకుంట్ల గ్రామం పరిసరాల్లో ఉన్న చారిత్రక బావిని సోమవారం పాఠశాల విద్యార్థులు సందర్శించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ దిగుడు మెట్ల బావిలో పూడిక చేరి చుట్టూ ముళ్లకంపలు పెరిగి మరుగున పడడంతో నంద్యాలకు చెందిన 'మన ఊరు– మన గుడి – మన బాధ్యత' సంస్థ సభ్యులు ఆదివారం శుభ్రం చేశారు. ముళ్లకంపలు తొలగించి, పూడిక తీయడంతో బావి సుందరంగా తయారైంది. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ బావిని సుమారు 177 ఏళ్ల క్రితం నిర్మించి ఉంటారని గ్రామస్తులు తెలుపుతున్నారు. బావి కోసం ఉపయోగించిన ఎర్రటి, గోధుమ రంగు ఇసుక రాళ్లపై పురాణ, ఇతిహాస నేపథ్యాలతో శిల్పాలను చెక్కారు. ఈ పురాతన బావిని గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉశేనయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులతో కలసి సోమవారం సందర్శించారు. విద్యార్థులు బావి గోడలపై ఉన్న శిల్పాలను ఆసక్తిగా వీక్షించారు. ఉపాధ్యాయులు పురాత బావి చరిత్రను, నాటి కళా నైపుణ్యాన్ని విద్యార్థులకు వివరించారు. పురాతన సంపదను పరిరక్షించుకోవాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంటు మృతి


బాలస్వామి (ఫైల్)

జూపాడుబంగ్లా: తరిగోపుల గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంటు బాలస్వామి (38) సోమవారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందాడు. ఇతని తల్లి లక్ష్మమ్మ గ్రామ సర్పంచ్‌గా ఉంటూ 10 నెలల క్రితం మృతిచెందింది. ఆమె మృతితో తీవ్ర మనస్తాపానికి గురైన బాలస్వామి ఇటీవల అనారోగ్యం బారిన పడ్డారు. ఆయన్ను చికిత్స నిమిత్తం రెండు రోజుల కిందట కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానంగా ఉన్నారు. కుటుంబ జీవనాధారమైన వ్యక్తి మృతిచెందడంతో అతని భార్యా, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో అందరితో సన్నిహితంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ మృతితో విషాదఛాయలు అలుముకొన్నాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఓ గౌరీబాయి, ఉపాధి హామీ పథకం ఈసీ, టీఏ, వివిధ గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంగళవారం తరిగోపులలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.